క్లుప్తంగా

కరెంటు బిల్లులపై చంద్రబాబు మోసం


విద్యుత్ బిల్లులను దగ్ధం చేస్తున్న సీపీఎం నాయకులు

మేదరమెట్ల: పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మేదరమెట్లలో నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మోండ్రు ఆంజనేయులు మాట్లాడుతూ అదానీ చేసే కుంబకోణాలకు ఫలితంగా ఈ విద్యుత్ చార్జీలను ఎంచారన్నారు. ప్రధాని మోదీకి అదాని అనుకూలం, అదానికి మోదీ అనుకూలంగా ఉండటం వల్లనే అందరూ కలసి దేశాన్ని దోచుకుతింటున్నారని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో తాను అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలను పెంచడం ఏంటని ఆయన ప్రశ్నించారు. నిరసన కార్యక్రమంలో భాగంగా విద్యుత్ బిల్లులను మంటల్లో దగ్ధం చేశారు. కార్యక్రమంలో రవీంద్రబాబు, వైకుంఠం, కోటేశ్వరరావు, విజయకుమార్, యోహాన్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, మార్గశిర మాసం, పనర్వసు నక్షత్రం, విదియ తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయు సోమవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకి సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం

బల్లికురవ: బాలికలు రక్తహీనత లేకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో దాసరి సుధ కోరారు. కిషోర వికాసం కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సుధ మాట్లాడుతూ జీవితంలో స్థిరపడేవరకు బాలికలు వివాహం చేసుకోవద్దన్నారు. గ్రామాల వారీగా బాలికా సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని అప్పుడే బాల్య వివాహాలకు చెక్ పెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమకుమారి, ఎంఈవో రమేష్‌బాబు, వైద్యాధికారి రమీజ్ అహ్మద్, ఎంపీ ఫౌండేషన్ హరిహర రెడ్డి పాల్గొని మాట్లాడారు.

పబ్లిక్ టాయిలెట్స్ రెడీ !

- మార్టూరులో ఎట్టకేలకు రూపుదిద్దుకుంటున్న పబ్లిక్ టాయిలెట్స్
- దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు


జాతీయ రహదారి పక్కన నిర్మాణం జరుగుతున్న మరుగుదొడ్లు

మార్టూరు: దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికుల సమస్యలకు మోక్షం కలిగింది. సుమారు 25 వేల మంది జనాభా, మార్టూరు పరిసర ప్రాంతాల నుంచే కాక దూరప్రాంతాల నుంచి నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే మండల కేంద్రం మార్టూరు సెంటర్. ఈసెంటర్‌లో మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల నుంచి ఏ అర్ధరాత్రో వేకు జామునో మార్టూరులో బస్సు దిగే ప్రయాణికులకు టాయిలెట్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ప్రజలు, ప్రయాణికుల ఇబ్బందులు తొలగించటం కోసం గత ప్రభుత్వ హయాంలో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు ఆగిపోయాయి. జాతీయ రహదారికి ఇరువైపులా గల సర్వీస్ రోడ్ల వరకు గల భూమి కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జాతీయ రహదారుల శాఖకు చెందినది కావడంతో మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన భూమి కోసం రహదారి అధికారుల అనుమతులు తీసుకోవటం తప్పనిసరి అయింది. మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన భూమిని స్థానిక అధికారులు స్టేట్ బ్యాంక్ సెంటర్‌లో జాతీయ రహదారికి తూర్పు వైపున పెద్ద అండర్ పాస్ పక్కన నిరుపయోగంగా ఉన్న ఖాళీ భూమిని గుర్తించారు. అనుమతుల అనంతరం మార్టూరు పంచాయతీ కార్యాలయానికి సంబంధించి 15వ ఆర్థిక నిధుల నుంచి రూ.10 లక్షలు, సాధారణ నిధులు నుంచి రూ.5 లక్షలు, మొత్తం రూ.15 లక్షల అంచనా వ్యయంతో పంచాయతీ కార్యదర్శి అంచనాలు రూపొందించారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి నీటి సౌకర్యం కోసం జాతీయ రహదారిపై 300 అడుగుల లోతు బోరు వేశారు. మహిళల కోసం మూడు, పురుషుల కోసం మూడు మొత్తం ఆరు మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు అదనంగా మరో ఆరు మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. పర్యావరణ పరమైన ఇబ్బందులు లేకుండా పచ్చదనం పరిశుభ్రతతో కూడిన మరుగుదొడ్ల నిర్మాణం కోసం నీరు, విద్యుత్, శానిటేషన్ తదితర అన్ని హంగులతో నిర్మాణం చేపట్టనున్నారు. జాతీయ రహదారిపై మరుగుదొడ్ల నిర్మాణం అధికారులు చేపట్టడంతో దశాబ్దాల కాలంగా ప్రజలు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు భావిస్తున్నారు.

> **సంక్రాంతికి మరుగుదొడ్లు ప్రారంభిస్తాం..**
>
> 
>
> సుదీర్ఘ కాలంగా ప్రజలు ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తున్నాం. వచ్చే నెల సంక్రాంతి నాటికి మరుగుదొడ్లను ప్రారంభించి ప్రజలు ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తాం.
>
> – తన్నీరు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, మార్టూరు

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- రైతుల సమస్యలపై ధర్నా
- డిమాండ్ చేసిన రైతు సంఘాలు

ఇంకొల్లు (చినగంజాం): రైతులను అన్ని విధాల ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని రైతుల సంఘం నాయకులు విమర్శించారు. ఇంకొల్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం నాయకులు సోమవారం రైతుల సమస్యలపై ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తారుమారైన రైతుల భూముల రికార్డులను రెవెన్యూ అధికారులు సత్వరం సరిచేసి సమస్యను పరిష్కరించాలని రైతు సంఘం నాయకుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. భూముల సర్వేలో పొరపాట్లు జరగాయని వాటిని సవరణ చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు విరమించుకొని ప్రజలపై భారాన్ని తగ్గించాలన్నారు. పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు గడువు పెంచాలని, ఎవరి సాగులో ఉన్న భూమి సబ్ డివిజన్ చేసి వారి పేరుతో రికార్డు చేయాలని, సర్వే తప్పులను, వెబ్ ల్యాండ్‌ను కూడా రద్దు చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ డబ్బులు, కౌలు రైతులందరికీ రైతుల అనుమతితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులో పంటరాయితీలు వర్తింపజేయాలని, పంటదారుల విషయంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేరారు. ధర్నా అనంతరం రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ వెంకటరత్నానికి వినతి పత్రం అందచేశారు. ఈ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం నాయకులు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు బాచిన కోటేశ్వరరావు, ఎర్రం గోవిందరెడ్డి, నల్లతోటి బావన ప్రసాద్, అన్నం ఆదియ్య, బండి సాంబయ్య, మాదాల అంజయ్య, కొల్లూరి హనుమంతరావు, సంజీవరెడ్డి, జిల్లా సీఐటీయూ నాయకులు కట్టాబాబురావు, పలువురు రైతులు పాల్గొన్నారు.


ఇంకొల్లులో ధర్నా నిర్వహిస్తున్న రైతులు


పంగులూరులో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు


మార్టూరులో తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల రైతుల ధర్నా

మార్టూరు: అపరిష్కృతంగా ఉన్న రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు నిర్వహించిన ధర్నాలో నాయకులు మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని, శనగ, మినుము, మొక్కజొన్న, మిర్చి పంటలకు గిట్టుబాటు ధరలను ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలనే డిమాండ్లను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ టీ ప్రశాంతికి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు సాంబశివరావు, వీ కృష్ణమూర్తి, బత్తుల హనుమంతరావు, వై. రాంబాబు, పాలెపు శ్రీనివాసరావు, షేక్ రహీం, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జే.పంగులూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ సింగారావుకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు గిట్టుబాటు ధరలు లేకపోవటం తద్వారా నష్టాల పాలైతే రైతు బాధ్యుడు కాదని, అయినా నష్టాలను రైతులే భరించాల్సి వస్తుందని అన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాయిని వినోద్‌బాబు మాట్లాడుతూ రైతులు ఆదుకోవాల్సిన ప్రభుత్వం కావాలనే వ్యవసాయాన్ని నష్టాల పాలు చేసి, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం పథకం ప్రకారం వ్యవసాయ రంగాన్ని దివాల తీయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతులు తలపనేని సుబ్బారావు, తానికొండ సుధాకర్‌రావు, రావూరి వెంకటేశ్వర్లు, నందవరపు జాన్ సాహెబ్ పలువురు రైతులు పాల్గొన్నారు.

కార్మికులకు నూతన వస్త్రాలు అందజేత


వస్త్రాలు అందజేస్తున్న దాతలు డాక్టర్ బాబురావు దంపతులు

చీరాల రూరల్: పారిశుద్ధ్య కార్మికులకు వాకర్స్ సభ్యులు నూతన వస్త్రాలు అందించారు. వాకర్స్ ఇంటర్‌నేషనల్ ఎన్ఆర్అండ్‌పిఎం హైస్కూలు ఆధ్వర్యంలో ప్రేమ హార్ట్ అండ్ డయాబెటిస్ హాస్పటల్ అధినేత డాక్టర్ ఇస్తర్ల బాబురావు, సుభాషిణి దంపతుల సహకారంతో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సోమవారం హైస్కూలు క్రీడా మైదానంలో మున్సిపల్ కార్మికులకు నూతన వస్త్రాలను వాకర్స్ ఇంటర్‌నేషనల్ మాజీ ప్రెసిడెంట్ నేతాజి సుబ్బారెడ్డి, డిస్ట్రిక్ట్ 203 గవర్నర్ పలనాటి శ్రీనివాసులు రెడ్డి చేతులు మీదుగా అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులు సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, గొడవర్తి సుధాకర్, వలివేటి మురళీ కృష్ణ, దేవకి సుబ్బారావు సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి


విలేకరులతో మాట్లాడుతున్న దళిత నేత నీలం నాగేంద్రం

మేదరమెట్ల: ఎస్సీ ఎస్టీ, మైనార్టీలకు సబ్సిడీ రుణాలు బడ్జెట్‌లో కేటాయించాలని కూటమి ప్రభుత్వాన్ని నీలం నాగేంద్రం డిమాండ్ చేశారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల సోమవరప్పాడు వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన విలేకరుల సమావేశంలో సోమవారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు చెప్పిన మాటలకు అధికారంలోకి వచ్చాక చేస్తున్న చేష్టలకు ఎలాంటి పొంతన లేదన్నారు. మేనిఫెస్టోలో చెప్పినట్లు ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకు వృద్ధాప్య పింఛను మంజూరు చేయించాలన్నారు. అడ్డగోలుగా విద్యుత్ చార్జీలను పెంచడం, బిల్లులు చెల్లించకపోతే కనక్షన్‌లు కట్‌చేస్తూ, భారీ పెనాల్టీలు విధిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా కార్యదర్శి కాకుమాను రవి, దేవరపల్లి గోపి, కసుకుర్తి ప్రసాద్ రాంబాబు, అంకరాజు, కే.గోపి, పాల్గొన్నారు.

ఆధార్ కోసం ప్రత్యేక డ్రైవ్


తహశీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న యానాది సంఘం నాయకులు

వేటపాలెం: ఎస్టీల (యానాదులు) కోసం ఆధార్ కార్డు జారీ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జిల్లా యానాది సమాఖ్య ఉపాధ్యక్షుడు గంధళ్ల నరేష్ తహశీల్దార్‌ను కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో యానాది సమాఖ్య, యానాది సంఘాల మహా కూటమి ఆధ్వర్యంలో తహశీల్దార్‌కి వినతి పత్రం సోమవారం అందజేశారు. ఈసందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఆధార్ నమోదుకు కావాల్సిన జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ జారీలో జాప్యం జరుగుతోందన్నారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ పార్వతి వీర్‌టలు త్వరగా విచారణ పూర్తి చేసి ఆధార్ నమోదు కాని వారికి త్వరగా ఆధార్ నమోదు చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నంబూరి నాగయ్య, వేటగిరి సంజీవరావు, పోట్లూరి శ్రీను పాల్గొన్నారు.

కాల్‌మనీ నేరగాళ్లపై రౌడీ షీట్లు


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్

వేటపాలెం: కాల్‌మనీ (అధిక వడ్డీలు) వసూలు చేసే నేరగాళ్లపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని చీరాల డీఎస్పీ సయ్యద్ మొయిన్ హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీల్లో భాగంగా వేటపాలెం పోలీస్ స్టేషన్‌ను సోమవారం డీఎస్పీ సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులు, గదులు, కంప్యూటర్లను పరిశీలించి స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం విలేకర్లతో డీఎస్పీ మాట్లాడుతూ చీరాల సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు. కాల్‌మనీ నేరాలకు పాల్పడే వారిపై ఇప్పటికే కొంత మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేశామని, కొంత మందిని రిమాండ్‌కి పంపించామన్నారు. చీరాల సబ్‌డివిజన్ పరిధిలో 11 స్టేషన్‌ల్లో దాదాపుగా 3 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు, చిట్టీలు, సైబర్ క్రైమ్స్, ట్రాఫిక్ కేసులు వంటివి అధికంగా ఉన్నాయని తెలిపారు. బైపాస్ రోడ్డులో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. వీటి నియంత్రణకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

పర్యాటకులకు భద్రత..

వేటపాలెం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ రూ.25 కోట్లు గోల్‌మాల్ కేసులో ప్రాథమిక చార్జిషీట్ కోర్టులు వేశామని చెప్పారు. విచారణ పూర్తి అయిన తరువాత పూర్తిస్థాయిలో చార్జిషీట్ వేస్తామన్నారు. నిందులకు సంబంధించిన ఆస్తులు అటాచ్ చేశామన్నారు. దీనిపై ప్రభుత్వం జీఓ విడుదల చేయాల్సి ఉందని, జీఓ విడుదల చేసిన తరువాత కాజేసిన నగుదు రికవరీ చేసి కోర్టు ముందుంచుతామని చెప్పారు. పోలీస్ స్టేషన్ పరిధిలో సముద్ర తీర వెంట ఎక్కువగా రిసార్టులు ఏర్పాటు చేశారన్నారు. ఈ రిసార్టులకు దూర ప్రాంతాల నుంచి విహర యాత్రకోసం పర్యాటకులు వస్తున్నారని వీరి భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. చీరాల రూరల్ ప్రాంతంలో శాంతి భద్రలపై రూరల్ సీఐ శేషగిరిరావు, వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై ఎం వెంకటేశ్వర్లను అడిగి తెలుసుకున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


మాట్లాడుతున్న ఏపీఎస్ఐఆర్‌డీ జాయింట్ డైరెక్టర్ కేశవరెడ్డి


చినగంజాంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు


పంగులూరులో మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూపరాణి

- ఏపీఎస్ఐఆర్‌డీ జాయింట్ డైరెక్టర్ కేశవరెడ్డి

వేటపాలెం: గ్రామాల అభివృద్ధి కోసం పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఏపీఎస్ఐఆర్‌డీ జాయింట్ డైరెక్టర్ కే. కేశవరెడ్డి సూచించారు. మండల పరిషత్ ప్రాంగణలోగల ఐసీడీఎస్ సమావేశ హాల్లో ఎల్ఎస్‌డీజీపై మండల, గ్రామ అధికారులకు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. శిక్షణాకార్యక్రమాల పరిశీలిన కోసం వచ్చిన జేడీ మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్యం, తాగునీటి సౌకర్యం, స్వయం సమృద్ధి, సుపరిపాలన, సామాజిక న్యాయం, స్త్రీల రక్షణపై ప్రత్యేక శిక్షణ అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. రెండు రోజులు పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి శివసుబ్రహ్మణ్యం, సూపరింటెండెంట్ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాలపై అవగాహన కలిగి ఉండాలి..

చినగంజాం: పంచాయతీల అభివృద్ధి లక్ష్యాలపై అందరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని డీఎల్‌డీఓ కే పద్మావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 'పంచాయతీల సుస్థిర ఆర్థికాభివృద్ది' లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఏ శ్రీనివాసమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సుబ్బారావు, వైద్యాధికారి డాక్టర్ విజయభాస్కర్, అంగన్‌వాడీ సూపర్ వైజర్ సుమలత, గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిలు ఉన్నారు.

పంగులూరులో..

జే.పంగులూరు: గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి సాధించేందుకు అధికారులు కృషి చేయాలని పంగులూరు ఎంపీడీవో కే స్వరూపరాణి అన్నారు. మండలంలోని అధికారులకు ఎల్ఎస్‌డీజీపై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు మొదటి రోజైన సోమవారం పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల సుస్థిర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 17 లక్ష్యాలు రూపొందించన్నారు. వాటిలో 9 ముఖ్యమైన ఇతివృత్తాలను రాష్ట్రంలో అమలు జరపాలని ప్రభుత్వం భావించిందని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు తేళ్ల నాగమ్మ, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రమ్మ, ఏపీఎం జ్యోతిప్రసాద్ బాబు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు జయప్రద, పద్మజ. కార్యదర్శులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

చీరాల టౌన్: పాడి పశువుల పెంపకంలో, జీవాల ఆరోగ్యంపై పశుపోషకులు జాగ్రత్తగా ఉండాలని వలన జీవాలకు సీజనల్ వ్యాధులు దరిచేరవని పశువైద్యులు పావని సూచించారు. సోమవారం మండలంలోని ఈపురుపాలెం గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గేదెలకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, చూడి పరీక్షలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు, పాడి పశువులు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా పశువైద్యురాలు పావని మాట్లాడుతూ.. రైతులకు వ్యవసాయం, పశువుల పెంపకం ముఖ్యమైనవని పాడి పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటుగా క్రమం తప్పకుండా చూడి పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది, పశు పోషకులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వవిద్యార్థుల వితరణ


పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

మార్టూరు: తాము చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థులు సాయం అందించారు. సోమవారం మండలంలోని వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.30 వేల విలువైన కంప్యూటర్‌ను బహూకరించారు. 2022–23 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన గోలి శశిసాయి దీప్తి, గోలి జీవన, షేక్ నాగూర్ వలి ముగ్గురు కలిసి తమ సొంత నిధులతో పాఠశాలకు అవసరమైన కంప్యూటర్‌ను హెచ్ఎం కే వెంకటేశ్వర్లుకు అందజేశారు. పాఠశాల విద్యార్థుల అవసరాలను గుర్తించి కంప్యూటర్‌ను బహూకరించిన పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పోలీసుల అదుపులో గ్రానైట్ లారీలు

బల్లికురవ: పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న నాలుగు గ్రానైట్ ముడిరాయి లారీలను మైనింగ్ ఆర్ఐ రాజు అదుపులో తీసుకున్నారు. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ నుంచి సంతమాగులూరు వైపు వెళ్తుండగా ఆదివారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం లారీలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పర్మిట్ లేకుండా గ్రానైట్ మీటరు, ముడిరాళ్లు, స్లాబులను తరలించడం నేరమని సీఐ హెచ్చరించారు.

అధ్యాపక సంఘ ఎన్నికల్లో పదవులు


పదవులు పొందిన అధ్యాపకులు

అద్దంకి: విజయవాడలోని సీవీఆర్ కళాశాలలో ఆదివారం రాతి వరకు నిర్వహించిన అధ్యాపక సంఘ ఎన్నికల్లో అద్దంకిలోని కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలకు చెందిన అధ్యాపకులకు పలు పదవులు లభించాయి. అందులో కళాశాలకు చెందిన కంప్యూటర్ లెక్చరర్ డాక్టర్ చల్లా ప్రసాద్ జోన్–2 పూర్వ గుంటూరు ప్రకాశం, నెల్లూరు జిల్లాల కార్యనిర్వాహక మండల సభ్యుడిగా ఎన్నికయ్యారు. డాక్టర్ చిలకా అనిత రాష్ట్ర మహిళా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈఎన్నికల్లో జోన్–3లో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజేతలకు కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు. సంఘంలోని సభ్యుల సమస్యలపై పోరాటాలు చేయడానికి తాము ఎప్పుడూ అందుబాటులో ఉంటామని చెప్పారు. విజేతలకు జిల్లా సీసీటీఏ ప్రసిడెంట్ అబ్దుల్ నయీమ్, అశోక్ కుమార్, వేటి ప్రసాద్, సురేశ్ కుమార్, శర్మిల తదితరులు అభినందనలు తెలిపారు.

ఆగిన లారీని ఢీకొట్టిన యువకుడు


క్షతగాత్రుడు వెంకటనారాయణ

బల్లికురవ: బైకుపై గ్రామానికి వస్తూ ఆగిన లారీని ఓ యువకుడు ఢీకొట్టటంతో గాయాల పాలయ్యాడు. ఈ ఘటన సోమవారం బల్లికురవ–సంతమాగులూరు ఆర్అండ్‌బీ రోడ్డులోని ఈర్లకొండ సమీపంలో జరిగింది. అందిన వివారల మేరకు.. మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందని ఏల్చూరి వెంకటనారాయణ పనినిమిత్తం గుంటూరు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. స్థానికులు బల్లికురవ 108 వాహనానికి సమాచారం అందించడంతో ఈఎంటీ నాగరాజు, పైలెట్ శ్రీనివాస్ గాయాలపాలైన వెంకటనారాయణకు ప్రాథమిక చికిత్స అందించి ఉన్నత చికిత్సకు చిలకలూరి పేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

వాటర్ ట్యాంక్ మరమ్మతులకు శ్రీకారం


ట్యాంక్ మరమ్మతులు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ నేతాజీ

కారంచేడు: గ్రామంలోని రెండు చెరువుల మధ్యన ఉన్న వాటర్ ట్యాంక్ లీకేజీలను దృష్టిలో ఉంచుకొని మరమ్మతులకు శ్రీకారం చుట్టామని ఎంపీడీఓ నేతాజీ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రం కారంచేడు పాత చెరువు వాటర్ ట్యాంక్ వద్ద మరమ్మతులకు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల క్రితం నిర్మాణం చేపట్టిని వ్యాటర్ ట్యాంక్ కొంత కాలంగా మరమ్మతులకు గురైన విషయాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సుమారు రూ.15 లక్షలతో మరమ్మతులు చేస్తామన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఈఓ సూర్యనారాయణ, ఏఈ కుమార్, సర్పంచ్ శివపార్వతి, ఎంపీటీసీ శేషారత్నం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.